

# రెండో పిట్ట

ఒక వర్తకుడు వర్తకానికి బయలుదేరాలి. ఎడారిలో ఎంతో దూరం ప్రయాణించి వ్యాపారం ముగించుకొని రావాలి.

దారిలో తిండి దొరుకుతుందో లేదో తెలియదు. నీళ్లు దొరుకుతాయో లేదో తెలియదు. ఏ ఆపద తరుముతుందో ఏ ముప్పు ముంచుకొస్తుందో ఎవరికీ తెలియదు. ఇవన్నీ ఆలోచించుకున్న ఆ వర్తకుడు నిట్టూర్పులు విడిచి, బతకాలంటే యిన్ని బాదరబందీలుపడాలా అనుకొని - వెళ్ళేముందు ఒక స్నేహితుణ్ణి కలిసి 'మిత్రమా, నేను రావడానికి చాలాకాలం పడుతుంది. వచ్చాక కలుద్దాము. ఖుదాహాఫీజ్' అని చెప్పేసి వెళ్లాడు.

వెళ్లిన మూడు రోజులకే మళ్లీ ఆ వర్తకుడు తిరిగి వచ్చేశాడు.

స్నేహితుడు అతణ్ణి చూసి 'ఏమయ్యా, అప్పుడే తిరిగి వచ్చేశావు?' అని అడిగాడు.

'దారిలో ఒక వింత చూశాను. అందుకని వచ్చేశాను' అన్నాడు వర్తకుడు.

'ఏమా వింత?' అన్నాడు స్నేహితుడు.

'ఒకచోట ఒక పిట్ట పడి వుంది. అది గుడ్డిది. రెక్కలు కూడా లేవు. దాని తిండి అది సంపాదించుకోలేదు. ఊరికే అలా ప్రాణాలతో పడివుంది. ఏమిరా దీని జన్మ అని నేను చూస్తూ వుండగా ఎక్కడి నుంచో దూరంగా యింకో పిట్ట ఎగురుకుంటూ వచ్చింది. వచ్చి దానికి ఆహారం పెట్టింది. ఆ తర్వాత నీళ్లు తెచ్చిచ్చింది. ఆ తర్వాత సేవలు చేసింది. అలా ప్రతిపూటా దాని బాగోగులు చూస్తూనే వుంది. ఏదోఒక ఎడారిలో ఏదో ఒక మారుమూలన ఏదో ఒక గుడ్డిపిట్ట పడివుంటే దేవుడు దాని గురించి పట్టించుకొని సమయానికి ఆహారం అందిస్తున్నాడే, నిలువెత్తు మనిషిని మరి నాకు ఆ మాత్రం అందించడా? జానెడు పొట్ట కోసం ఈ ప్రయాణాలు ఎందుకు? ఈ వర్తకాలు ఎందుకు? ఈ దూరభారాలూ కష్టనష్టాలూ ఎందుకు? అన్నిటికీ ఆ దేవుడే వున్నాడు... నాక్కూడా తిండి పెడతాడు అనుకొని వెనక్కి వచ్చేశాను' అన్నాడు వర్తకుడు.

స్నేహితుడు నవ్వాడు.

'ఏమయ్యా ఆ పిట్ట గుడ్డిది. దానికి రెక్కలు లేవు. అందుకని దేవుడు దానికి ఆహారం పెడుతున్నాడు. మరి నీకు ఏమైంది. నీకు కాళ్లూ చేతులూ లక్షణంగా వున్నాయే. కళ్ళు సలక్షణంగా కనబడుతున్నాయే. నువ్వు కష్టపడగలవే. పని చేయగలవే. నీ దృష్టంతా ఎంతసేపటికీ మొదటి



పిట్ట మీదే ఉందిగానీ రెండో పిట్టను చూశావా? కాళ్ళూ చేతులూ సక్రమంగా వున్న జన్మెత్తినందుకు అది నలుగురికీ సాయం చేయాలనుకుంటోంది. కష్టపడి బతకాలనుకుంటోంది. మంచి పేరుతో చావాలనుకుంటోంది. మనం ఆ రెండో పిట్ట కావాలి. కష్టపడి మనల్ని మనం పోషించుకోవాలి. చేతనైనంతలో యితరులకి సాయం చేయాలి. అది గదా జన్మంటే' అన్నాడు.

వర్తకుడు యింకేమి మాట్లాడలేదు. మరుసటిరోజే మళ్లీ వర్తకానికి బయలుదేరాడు. ఆ తర్వాత చేతనైనంతలో నలుగురికీ సాయం చేస్తూ బతికాడు.